క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి

పీలేరు : నిత్యం యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథరెడ్డి అన్నారు. గురువారం కోటపల్లె శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అనుబంధం శ్రీనివాస కల్యాణ మండపంలో యోగా శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు యోగా శిక్షణ ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కంభం నరసింహారెడ్డి, షీ యోగా సంస్థ నిర్వాహకులు పి.వి.ఎస్.లక్ష్మీ, సుధాకర రాయలు, కవిత, హరిత, భాగ్యలక్ష్మీ, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


లక్ష్మీకాంతమ్మ మృతదేహం వద్ద నివాళుల ర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


కేవీపల్లె : బాధిత కుటుంబాన్ని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పరామర్శించారు. మండలంలోని సొరకాయలపేట పంచాయతీ వంగిమళ్లవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాస్ మల్లికార్జునరెడ్డి తల్లి లక్ష్మీకాంతమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం వంగిమళ్లవారిపల్లెకు చేరుకుని లక్ష్మీకాంతమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం రాస్ మల్లికార్జునరెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, నాయకులు సతీష్‌రెడ్డి, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లను కాపాడుదాం.. సృష్టిని రక్షిద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

పీలేరు : 'ఆడపిల్లను కాపాడుదాం.. సృష్టిని రక్షిద్దాం' అని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆడబిడ్డ సంక్షేమం దృష్ట్యా ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డ జన్మించేది సంపూర్ణంగా జీవించడానికేనని, వారి విద్య, ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గర్భస్థ పిండం ఆడబిడ్డ అని తెలియగానే గర్భస్థ హత్యకు పాల్పడడం కేవలం ఆ కుటుంబానికే కాకుండా మొత్తం సమాజానికి తీవ్ర నష్టమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, ప్రిన్సిపాల్ వెంకటసుబ్బమ్మ, సూపర్‌వైజర్‌లు కృష్ణయ్య, అక్కయ్య, ఏఎన్‌ఎం పాముస్నీషా, సీహెచ్‌వో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించండి


ఏఓకు వినతిపత్రం అందిస్తున్న గ్రీన్ అంబాసిడర్‌లు

నిమ్మనపల్లె : గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శోభ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ శశికుమార్‌కు గ్రీన్ అంబాసిడర్లతో కలిసి ఆమె వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లను మండలపరిషత్ నుంచి పంచాయతీలకు బదిలీ చేయడం వల్ల జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి గ్రీన్ అంబాసిడర్ కార్మికుడికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. రూ.10 లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలన్నారు. తిరిగి గ్రీన్ అంబాసిడర్లను మండలపరిషత్ పరిధిలోకి తేవాలన్నారు. ఈఎస్‌ఐ సౌకర్యంతో కూడిన హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్‌లు రెడ్డెప్ప, రమణ, శ్రీనివాసులు, నారాయణ, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

12న వ్యాస రచన పోటీలు

మదనపల్లె సిటీ : శ్రీ హనుమంతుని జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు స్థానిక వరాల ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం ఆవరణలో జరిగే పోటీల్లో 20 ఏళ్లలోపు విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి గల వారు స్కూల్ ద్వారా గానీ నేరుగా గానీ ఆలయ కమిటీని సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు శ్రీరామనవమి రోజు బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

పోలింగ్ కేంద్రాల తనిఖీలో ఆర్డీఓ మురళి


కురబలకోటలో పోలింగ్ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళి

కురబలకోట : ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని మదనపల్లె ఆర్డీఓ మురళి తెలిపారు. కురబలకోట జెడ్పీ హైస్కూల్‌లో మూడు పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను ఆయన గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు) కీలకంగా వ్యవహరించాలని సూచించారు. పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు విడివిడిగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట తహశీల్దారు ఎం.భీమేశ్వరరావు, ఎస్ఐ సుకుమార్ ఉన్నారు.

నియమావళి పాటించాలి

తంబళ్లపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో నియమావళిని పాటించాలని ఆర్డీవో మురళి అధికారులను ఆదేశించారు. తంబళ్లపల్లె ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఓటర్ల నమోదు విషయమై తహసీల్దార్ కళావతిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఆనంద్‌కుమార్, ఎంఈవో త్యాగరాజు, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి, పీఆర్‌డీఈ విజయమోహన్ తదితరులు ఉన్నారు. అనంతరం పెద్దమండ్యం మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ నిర్మలదేవి, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎస్ఐ వెంకటేష్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ మురళి పరిశీలించారు. పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు, పోలింగ్ ఏజెంట్లు కూర్చునే వరుస క్రమం, లైటింగ్, తాగునీరు అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఎస్ఐ నజీర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : స్థానికంగా పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో మురళీ పరిశీలించారు. కిటికీలు, తలుపులు, నీటి సౌకర్యం, వెలుతురు లాంటి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలని తహసీల్దార్ విద్యాసాగర్, ఎస్ఐ మధురామచంద్రుడును ఆదేశించారు. ఆర్డీవో వెంట ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ఆర్ఐ అనీషా, వీఆర్వోలు ఉన్నారు.

వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగట్టు వెంకటరమణస్వామి

రామసముద్రం : మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గట్టు వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అంకురార్పణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వేదపండితులచే వేదమంత్రాలతో గణపతిపూజ, హోమాలు నిర్వహించారు. హుల్లూరు వంశస్తులచే అంకురార్పణకు పూజ, సామగ్రి అందజేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయప్రధాన అర్చకులు రామచంద్రభట్టర్, దర్శన్‌భట్టార్‌లు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బాలికల సంరక్షణకు ప్రాధాన్యం

కేవీపల్లె : బాలికల సంరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ రేష్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడకల్లో భాగంగా గురువారం మండలంలోని వగల్లలో గర్నిమిట్ట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లపై బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినులు ఏవైనా ఇబ్బందులు ఎదర్కొంటే నిర్భయంగా ఫిర్యాదులో రాసి పాఠశాలలోని ఫిర్యాదు బాక్సులో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషలాఫీసర్ శ్రావణి, పీహెచ్ఎన్ రమాదేవి, ఆరోగ్య విస్తరణాధికారులు కృష్ణమ్మ, కృష్ణయ్య, సీహెచ్‌వో లోకేశ్వరి, స్టాఫ్ నర్స్ సులోచన, ఆరోగ్య సహాయకులు వెంకటరమణ, అలేఖ్య, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి


ఓటర్లను అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కేవీపల్లె : ఈ నెల 13న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి కోరారు. గురువారం మండలంలోని కేవీపల్లె, గర్నిమిట్ట, వగల్ల తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో కరపత్రాలు అందజేసి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డిలను గెలపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ యూత్ మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, నాయకులు యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట: తూర్పు రాయలసీమ పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ బి.దస్తగిరి, మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వారు పట్టభద్రులతోపాటు సచివాలయ ఉద్యోగులను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు పోరెడ్డి విశ్వారెడ్డి, నులక మనోహర్‌రెడ్డి, యువ నాయకులు కోళ్ల వాసుదేవరెడ్డి, అంజాద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల భూముల్లో మట్టి తరలింపుపై నిరసన


పేదలతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారి నిర్మాణం కోసమని అనుమతులు తీసుకున్న సర్వే నంబర్‌లో కాకుండా పేదల భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మదనపల్లె–తిరుపతి జాతీయ రహదారికి పక్కన బసినికొండ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 1130లో పేదల భూముల్లో మట్టి తవ్వకాలు జరుపుతుండగా.. గురువారం స్థానిక పేదలతో కలిసి పనులను అడ్డుకున్నారు. హిటాచీ, జేసీబీ, టిప్పర్లను పంపేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండలంలో భూకబ్జాలను అరికట్టడం, ప్రభుత్వస్థలాలను కాపాడటంలో తహసీల్దార్ విఫలమయ్యారని ఆరోపించారు. జాతీయ రహదారి నిర్మాణానికి సర్వే నంబర్.987లో అనుమతులు తీసుకున్న హైవే కాంట్రాక్టర్ దానిపక్కనే ఉన్న సర్వే నంబర్ 1130లో పేదలకు మంజూరు చేసిన భూముల్లో తవ్వకాలు జరిపాడన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు మాట్లాడుతూ పేదల భూములకు ఎలాంటి నష్టం జరగనివ్వబోమని, ఇప్పటి వరకు జరిగిన నష్టానికి కాంట్రాక్టర్ నుంచి భూములు చదును చేయించి ఇస్తామన్నారు. కాంట్రాక్టర్‌కు కేటాయించిన భూముల్లోనే మట్టి ఎత్తుకునేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ నాయకులు కృష్ణప్ప పాల్గొన్నారు.

ప్రయాణికుల క్షేమమే ఆర్టీసీ లక్ష్యం

పీలేరు రూరల్ : ప్రయాణికుల క్షేమమే ఆర్టీసీ లక్ష్యమని డీఎం కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గిఫ్ట్ స్కీమ్ డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు డిపో పరిధిలో పీలేరు – సుండుపల్లె, సోమల – కలకడ మార్గంలో ప్రయాణికులకు గిఫ్ట్ స్కీమ్ డ్రా తీసినట్లు తెలిపారు. మొదటి బహుమతి సుండుపల్లెకు చెందిన ఎస్. రహంతుల్లా, ద్వితీయ బహుమతి పీలేరుకు చెందిన ఎం. సుధాకర్, తృతీయ బహుమతి పీలేరుకు చెందిన మస్తాన్ దక్కించుకున్నారని పేర్కొన్నారు. కలకడ – సోమల మార్గంలో ప్రథమ బహుమతి సోమలకు చెందిన సోమశేఖర్, ద్వితీయ బహుమతి కందూరుకు చెందిన పి.వి. శ్రీవల్లి, తృతీయ బహుమతి కలికిరికి చెందిన కె. తేజస్వి పొందారని వివరించారు. పీలేరు పట్టణానికి చెందిన మౌర్య కంటి ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ దేవులపల్లె మౌర్యరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ ధనుంజయకులు, ఎస్టీఐ సుధాకర్‌నాయక్, బస్‌స్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ములకలచెరువు : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పోలీసులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మండలంలోని వేపూరికోటలో వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. నగదు, అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని ఎస్ఐ డీవై స్వామి అన్నారు.

ఖాళీ షాపులకు టెండర్లు

మదనపల్లె సిటీ : మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో ఖాళీగా ఉన్న షాపులకు టెండర్లు పిలవనున్నట్లు టూ డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు టెండర్లలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు. టెండర్ల ఫారాలు శుక్రవారం నుంచి డిపో కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను 17లోపు రాయచోటిలోని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి కార్యాలయంలో టెండరు బాక్సులో వేయాలన్నారు. అదే రోజు సాయంత్రం టెండర్లు తెరవనున్నట్లు వివరించారు.

జూదరుల అరెస్ట్

గుర్రంకొండ : మండలంలోని సరిమడుగు పంచాయతీ పుల్లావాండ్లపల్లెలో గురువారం ఏడుగురు జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామానికి సమీపంలో పెద్ద ఎత్తున జూదం జరుగుతోందనే సమాచారం అందుకొన్న పోలీసులు కలకడ సీఐ నాగేంద్ర, గుర్రంకొండ ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.30,310 స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేశారు.

సమయం పాటించాలి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ బస్సులను సమయం ప్రకారం నడపాలని ఆర్టీసీ ఒకటో డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక డిపో కార్యాలయంలో సూపర్‌వైజర్లు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్యం మేరకు ఆదాయం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు జీవనోపాధి కల్పన

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


కుమార్‌రెడ్డి సంతాప సభలో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : ఎంతో మంది పేదలకు జీవనోపాధి కల్పించిన తొలితరం సినిమా థియేటర్ యజమాని మొగ్రంరెడ్డి కుమార్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని విద్యుత్, అటవీ, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం వాల్మీకిపురం సీతారాం థియేటర్‌లో మొగ్రంరెడ్డి కుమార్‌రెడ్డి సంతాపసభకు ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, నవాజ్ బాషాతో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎంతో మంది నిరుపేదలకు ఉపాధిని కల్పించిన గొప్ప వ్యక్తి కుమార్ రెడ్డి అని, సంఘ సేవా కార్యక్రమాలతోపాటు నిరుపేదలను ఆదరించారని కొనియాడారు. అనంతరం మొగ్రంరెడ్డి కుమార్‌రెడ్డి కుమారులు రాంకుమార్‌రెడ్డి, శ్యామ్ కుమార్‌రెడ్డిలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మదనపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, నాయకులు నల్లారి తిమ్మారెడ్డి, చింతల ఆనంద రెడ్డి, కేశవరెడ్డి, అబ్దుల్ కలీమ్, సీళ్లభాస్కర్, సాగుబడి ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడి


ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ

వాల్మీకిపురం : సంప్రదాయ వ్యవసాయ సాగు కంటే ప్రకృతి సాగుతోనే అధిక దిగుబడులతోపాటు ఆదాయం సాధ్యమని ప్రకృతి సాగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ అన్నారు. గురువారం మండలంలోని అయ్యావారిపల్లిలో రైతు హేమలత తనకు ఉన్న ఎకరం విస్తీర్ణంలో సాగు చేస్తున్న ఏ గ్రేడ్ మోడల్‌లో టమాట, బీన్స్, పెసర, మిరప, వంగ, అరటి, ఉల్లి, కొబ్బరి, ఆముదం, బంతి, ముల్లంగి, బెండ, మొటిక, సిర్రాకు, దంటాకు, చుక్కాకు, గోంగూర, బీర, కాకర, సొర, దానిమ్మ, కమల, చీని, నిమ్మ, జామ, సపోటా, అంజీరా, గ్రీన్ ఆపిల్, రెడ్ ఆపిల్ పంటల వ్యవసాయ పొలంను ప్రకృతి సాగు సిబ్బంది స్వాతితో కలిసి యశోదమ్మ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగులో చేపట్టాల్సిన మెళకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఏ గ్రేడ్ మోడల్‌లో అంతర్ పంటలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. 360 రోజుల పాటు దిగుబడులు, ఆదాయం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతిసాగు సిబ్బంది శ్రీనివాసులు, పెద్ద రెడ్డెయ్య, రెడ్డిబాషా తదితరులు పాల్గొన్నారు.

భోజన నిర్వాహకుల సమస్యపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న తహసీల్దార్ ఖాజాబీ

గుర్రంకొండ: ఏడాది కాలంగా నెలకొన్న మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యపై తహసీల్దార్ ఖాజాబీ విచారణ నిర్వహించారు. మండలంలోని నడిమిఖండ్రిగ పంచాయతీ గెరికుంటపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఎంపికపై ఏడాదిగా సమస్య నెలకొంది. గ్రామంలో నెలకొన్న వర్గవిభేదాల కారణంగా రెండు నెలలకు ఒకమారు పాఠశాలలో భోజన నిర్వాహకులను మార్చివేస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం గెరికుంటపల్లె గ్రామంలో తహసీల్దార్ ఖాజాబీ పర్యటించారు. పాఠశాలకు చేరుకొని ప్రస్తుతం ఉన్న భోజన నిర్వాహకులను విచారించారు. సమస్య ఎందుకు వస్తోంది అన్న అంశంపై ఆరా తీశారు. తదనంతరం పాఠశాల కమిటీ చైర్మన్‌ను పాఠశాల వద్దకు పిలిపించారు. సమస్య పరిష్కారానికి కమిటీ చైర్మన్ అందరి కంటే ముందుగా చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రతి రెండు నెలల కొకమారు సమస్య వస్తే నిర్వాహకులకు జీతాల చెల్లించే సమస్యతోపాటు పిల్లలకు భోజనం వడ్డించే విషయంలో సమస్యలు వస్తాయన్నారు. అందరూ కలసికట్టుగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చంద్రమోహన్, హెడ్మాస్టర్ అంజమ్మ, భోజన నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు


టీకా వేస్తున్న పశుసంవర్థకశాఖ సిబ్బంది

వాల్మీకిపురం : పశువుల్లో వ్యాప్తి చెందే గాలికుంట వ్యాధిని నివారించేందుకు టీకాలు వేయించాలని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు నీరజ అన్నారు. గురువారం వాల్మీకిపురం పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో గాలికుంట వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులు మేత మేయకుండా అనారోగ్యం బారిన పడుతాయని తెలిపారు. దీని వల్ల వాటిలో పాలదిగుబడి సామర్థ్యం తగ్గుతుందని, సకాలంలో ఎదకు రాకుండా ఉండి చూలు నిలువదని పేర్కొన్నారు. వ్యాధి సోకిన పశువు ఎండ తాకిడికి తీవ్రంగా ఆయాస పడుతుందన్నారు. వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలకు 26800 డోసులు టీకాలు వచ్చాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమం మార్చి 1వ తేది నుంచి 31వ తేది వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో టీబీని నివారిద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కేవీపల్లె : సమష్టి కృషితో క్షయ వ్యాధి (టీబీ)ని నివారిద్దామని పీలేరు టీబీ యూనిట్ క్షయ నివారణాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, జిల్లేళ్లమంద పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నూతనకాల్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ర్యాలీ, అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ వ్యాధి మైక్రో బ్యాక్టీరియమ్ ట్యూబర్ క్లోసిస్ అనే బ్యాక్టీరియాతో గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. వారానికి మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, గళ్లలో రక్తం పడడం టీబీ లక్షణాలని తెలిపారు. లక్షణాలు ఉన్న వారు ప్రభుత్వాస్పత్రిలో సంప్రదిస్తే ఉచితంగా గళ్ల పరీక్షలు చేస్తామని చెప్పారు. క్షయవ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులతోపాటు పోషకాహారం కోసం నెలకు రూ.500 వారి ఖాతాకు జమ చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ మోహన్, పవన్‌కుమార్, సీహెచ్‌వో ప్రతిభ, ఆశా వర్కర్లు నాగజ్యోతి, కళావతి, సుమంజలి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో ఎరువులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయని ఏవో ప్రేమలత అన్నారు. స్థానికంగా ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. అన్ని ఆర్‌బీకేల్లో వంద టన్నుల యూరియా, 30 టన్నుల డీఏపీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

కేవీపల్లె : విద్యా వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని ఎంఈవో రెడ్డిబాషా అన్నారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా ప్రభుత్వం అభివృద్ధి చేస్తూ పేద పిల్లల చదువుకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. విలువలతో కూడిన విద్య ప్రభుత్వ బడుల్లోనే లభిస్తోందన్నారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్, హెచ్ఎంలు వైవి. రమణ, శ్రీరాములురాజు, చంద్రయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నమ్మకమైన సేవలందించండి


పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వినియోగదారులకు నమ్మకమైన సేవలందించి, మన్ననలు పొందాలని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌టీఆర్ సర్కిల్‌లో టీకేఆర్ అడ్వైజరీ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన టీకేఆర్ గ్రూప్స్ సంస్థను ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ యజమాని శరత్‌కుమార్‌రెడ్డి మంత్రి, ఎమ్మెల్యే, చైర్‌పర్సన్‌లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, పీకేఎం–ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, పుంగనూరు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దండాల రవిచంద్రారెడ్డి, మిద్దింటి కిశోర్, గార్లచంద్రమౌళి, డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, శరణ్‌కుమార్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా, సింగిల్‌విండో డైరెక్టర్ దండుకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, భాస్కర్‌గౌడ్, కొండూరు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంక్‌లో బంగారుపై రుణాలు


సహకార బ్యాంకులో మహిళకు బంగారుపై రుణం అందిస్తున్న సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి

మదనపల్లె : చిత్తూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా మదనపల్లె ప్రాథమిక సహకార సంఘం బ్యాంకులో కొత్తగా బంగారుపై రుణాలు, సేఫ్టీ లాకర్ సదుపాయం ప్రారంభించినట్లు సింగిల్ విండో చైర్మన్ దండుకృష్ణారెడ్డి, ఏజీఎం చంద్రకళ తెలిపారు. గురువారం బ్యాంకులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బంగారుపై మంజూరైన రూ.27 లక్షల రుణాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 1 నుంచి 20 వరకు సహకార బంధు పేరుతో కొత్త డిపాజిట్ పథకాన్ని ప్రారంభించామని, ఇందులో సీనియర్ సిటిజన్స్‌కు 8 శాతం, ఇతరులకు 7.25 శాతం చొప్పున అత్యధిక వడ్డీ అందిస్తామన్నారు. అలాగే బంగారుపై వ్యవసాయం కింద 7 శాతం, ఇతరులకు 10.50 శాతంతో అతి తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామన్నారు. వీటితో పాటుగా కమర్షియల్ బ్యాంకులో ఇచ్చినట్లుగానే క్రాప్‌లోన్స్, మార్టిగేజ్ లోన్స్, ఇతర అన్ని సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు జిల్లా సహకార బ్యాంకు సేవలను వినియోగించుకుని ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈఓ కరుణాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.